కష్టాలను మిగిల్చిన

ఖరీఫ్

● తడిసిన ధాన్యం కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు

9



కంప్లి వద్ద ఆరబోసిన ధాన్యం




ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

# స్థానిక సమరానికి సిద్ధం కండి

● పార్టీ శ్రేణులకు డీసీఎం డీకే శివకుమార్ పిలుపు

● జిల్లా, తాలూకా పంచాయతీ, పాలికె ఎన్నికలు జరుపుతాం

● ఆశావహులు దరఖాస్తు చేసుకోండి..అవకాశం ఇస్తాం

● ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం: డీకే హామీ

బెంగళూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పదవులకోసం ఎదురు చూస్తున్నవారికి తీపికబురు అందింది. జిల్లా, తాలూకా పంచాయతీ, పాలికె ఎన్నికలకు సిద్ధం కావాలని కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టికెట్ ఆశిస్తున్నవారు అర్జీలు అందజేయాలని సూచించారు. ఈసారి మహిళలకు కూడా సముచిత ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. బెంగళూరులో వార్డుల విభజన ప్రక్రియ పూర్తయ్యిందని త్వరలోనే ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కొత్త ఓటర్ల జాబితా సిద్ధం అవుతోందని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. గురువారం కేపీసీసీ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో డీకే శివకుమార్ మాట్లాడారు. రాజకీయాల్లో 33శాతం రిజర్వేషన్లను ఎవరూ తీసివేయలేరన్నారు. తాము మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామన్నారు. నాయకులను సృష్టించేవారే నిజమైన నాయకుడన్నారు. నాయకుల కుటుంబీకులు నాయకులుగా ఎదగడం ముఖ్యం కాదని ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించాల్సి ఉందన్నారు.

### జీబీఎంపీ ఎన్నికలకు సై..

బెంగళూరులో గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ)లో 369 వార్డులను విభజించామని త్వరలోనే ఎన్నికలు జరుగుతాయన్నారు. వీటికితోడు జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. పాలికె ఎన్నికల వార్డుల రిజర్వేషన్లు త్వరలోనే విడుదల చేస్తామన్నారు. పాలికె ఎన్నికల్లో పోటీ చేసేవారు అర్జీలు సమర్పించవచ్చునన్నారు. ప్రస్తుతం కొత్త ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కార్యకర్తలు ఇంటింటా తిరిగి ఖాతా యోజనె, ఆస్తి గ్యారెంటీ యోజనెలగురించి అవగాహన కల్పిస్తూ ప్రచారం చేయాలన్నారు.

### కష్టపడ్డ కార్యకర్తలకు అధికారం ఇచ్చాం

మన నాయకులు ఓటు చౌర్యంపై పోరాటం చేస్తున్నారని, రాష్ట్రంలోనూ సంతకాల సేకరణ చేపట్టామన్నారు. బిహార్, మహారాష్ట్ర ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లపై ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. ప్రతిదానికి అంతం ఉంటుందన్నారు. తాను ఎక్కడ ఉంటాననేది ముఖ్యం కాదని, రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. మీరు మీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోరాదన్నారు. ఎక్కడ శ్రమ ఉంటుందో అక్కడ ఫలితం ఉంటుందని, ఎక్కడ భక్తి ఉంటుందో అక్కడ భగవంతుడు ఉంటారన్నారు. అనేక మండలులు, కార్పొరేషన్‌లకు డైరెక్టర్‌ల జాబితా సిద్ధమైందని, పునఃపరిశీలించి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులకు కూడా అధికారం కల్పిస్తామన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో ఎక్కువ మందిని చేర్పించిన హొళల్కెరె సవితాకు అధ్యక్ష స్థానం కల్పించినట్లు గుర్తు చేశారు. అనంతరం ఆమె తన అధికారాన్ని భర్తకు అప్పగించిందన్నారు. అందుకుగాను ఎన్‌ఎస్‌యూఐ, యువ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులుగా అవకాశం కల్పించామన్నారు. కష్టపడ్డ కార్యకర్తలకు అధికారం ఇచ్చామన్నారు. గ్యారెంటీ పథకాల కమిటీ ద్వారా ప్రతి సమితిలో 15మంది కార్యకర్తలకు అవకాశం కల్పించామన్నారు.


### నా హయాంలోనే వంద పార్టీ కార్యాలయాలు : డీకే

రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే 100 కాంగ్రెస్ కార్యాలయాలకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టనున్నట్లు డీకే తెలిపారు. ఇందుకు ఎవరు సహకారం ఇస్తున్నారు, ఎవరు ఇవ్వలేదనేది జాబితా సిద్ధం చేసి ఇవ్వాలని ఏఐసీసీ నాయకులు సూచించారన్నారు. కొంతమంది ఆసక్తి చూపగా మరికొందరు నిరాసక్తిగా ఉన్నారన్నారు. కొందరికి కేవలం అధికారం మాత్రమే కావాలన్నారు. కాంగ్రెస్ కార్యాలయం దేవాలయం అనేది కొంతమంది మరిచిపోయారని, అటువంటివారికి తాను బదులిచ్చేది లేదన్నారు. ఢిల్లీ నాయకులే సరైన సమయంలో తగిన బదులు ఇస్తారన్నారు. తాను ఎంతకాలంలో ఉంటానో తెలియదని, అయితే తన అవధిలో 100 కాంగ్రెస్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలన్నది తన ఆశయమన్నారు. ఈ సందర్భంగా 'గాంధీ భారత' అనే పుస్తకాన్ని విడుదల చేశారు. వంద సంవత్సరాల క్రితం గాంధీజీ అధ్యక్షతన బెళగావి సమావేశాలతోపాటు తమ కార్యక్రమాలను చేర్చి పుస్తకంగా రూపొందించినట్లు ఆయన తెలిపారు.



### అధ్యక్షస్థానంలో కొనసాగలేను

తాను కేపీసీసీ అధ్యక్షస్థానంలో శాశ్వతంగా కొనసాగేందుకు వీలులేదన్నారు. ఇప్పటికే ఐదున్నరేళ్లు ముగిసిందని, 2026 మార్చికి ఆరేళ్లు పూర్తి కానుందన్నారు. వేరేవారికి అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. తాను ఉపముఖ్యమంత్రి అయిన రోజునే ఈ హోదా వదులుకోవాలని నిర్ధారించుకున్నానన్నారు. అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ కొంత కాలం ముందుకు కొనసాగాలని కోరారన్నారు. తాను తన కర్తవ్యాన్ని నిభాయిస్తున్నట్లు తెలిపారు.



'గాంధీ భారత' పుస్తకంతో మంత్రి డీకే

# 25న శుభాంషు శుక్లాతో విద్యార్థుల చర్చాగోష్ఠి

● సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి ఎన్ఎస్ భోసరాజు



మీడియాకు వివరాలు తెలుపుతున్న మంత్రి భోసరాజు

బెంగళూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష యాత్ర చేసివచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంషుశుక్లా ఈనెల 25న బెంగళూరులో విద్యార్థులతో చర్చాగోష్ఠిలో పాల్గొంటారని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖా మంత్రి ఎన్ఎస్ భోసరాజు తెలిపారు. గురువారం బెంగళూరులో మంత్రి మీడియాతో మాట్లాడుతూ అంతరిక్ష వ్యోమగామి శుభాంషు శుక్లా నేరుగా విద్యార్థులతో చర్చాగోష్ఠిలో పాల్గొంటారన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్లానిటోరియంలోని యూఆర్ రావ్ భవన్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ద్వారా చర్చాగోష్ఠి ఏర్పాటు చేశామన్నారు. హైస్కూలు విద్యార్థులు నేరుగా తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేశామన్నారు. బెంగళూరుకు చెందిన విద్యార్థులు నేరుగా పాల్గొనేందుకు వీలుండగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల విద్యార్థులు ప్రాంతీయ విజ్ఞాన కేంద్రాల ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ద్వారా భాగస్వామ్యులయ్యే వెసలుబాటు కల్పించామన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో సైన్స్ పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని పరిశోధనలు, అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించి మరిన్ని వివరాలతో పాటు శుభాంషు శుక్లా అనుభవాలు తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. అందరికీ అవకాశం ఉంటుందన్నారు.

# రంగస్థలంపై ముగిసిన నాటకం

● మహిషాసురుడిగా నటిస్తూ.. గుండెపోటుతో కళాకారుడి కన్నుమూత

బెంగళూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రంగస్థలంపైనే ఆయన జీవిత నాటకం ముగిసింది. యక్షగాన నాటికలో భాగంగా మహిసాసుర పాత్రలో నటిస్తున్న మందార్తి నాటక మండలి కళాకారుడు ఈశ్వరగౌడ(51) గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం రాత్రి ఉడుపి జిల్లా మందార్తి రెండో మేళా సాగుతోంది. దేవీ మహాత్మ ప్రసంగం వేళ మహిషాసుర పాత్ర చేసిన ఈశ్వరగౌడ తన భాగం ముగియడంతో రంగులు తుడుచుకునేందుకు సిద్దమవుతున్నారు.



యక్షగాన వేషంలో.. ఈశ్వర గౌడ (ఫైల్)

ఉన్నఫళంగా ఒక్కసారిగా డ్రామా స్టేజీ వెనుకే కుప్పకూలాడు. తోటి నటులు ఇతరులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదే నాటికలో ఈశ్వరగౌడ తండ్రి కూడా ఓ పాత్ర పోషించారు. ఈశ్వరగౌడ నటుడిగానే మృతి చెందడంపై తోటి కళాకారులు, ప్రేక్షకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చిక్కమగళూరు జిల్లా శృంగేరికి చెందిన ఈశ్వరగౌడ మందార్తి నాటకమండలితో పాటు శివరాజపుర, మేగరవళ్లి మడామక్కి సంస్థలలో పనిచేసేవారని కుటుంబ సభ్యులు తెలిపారు.



నగరంలో ఇటీవల కుప్పకూలిన ఓ భవనం

# భయం భయం..!

● రాష్ట్రవ్యాప్తంగా ప్రమాద స్థాయిలో 32వేల భవనాలు ● అగ్నిమాపక శాఖ అనుమతులు లేవు

● అధికారుల సర్వేలో బట్టబయలు ● బాధ్యతలేని యజమానులు ● బెంగళూరులోనే అత్యధికం

బెంగళూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలు పాత భవనాలు ప్రమాదస్థాయికి చేరుకున్నాయి. రెండు అంతస్తులకు అనుమతులు... ఆపై పేక మేడల్లా ఆరేడు అంతస్తుల దాకా నిర్మాణాలు. మాకున్నది చిన్న స్థలం మరోచోటుకు వెళ్లలేం... అంటూ గాలి గోపురాన్ని తలపించేలా నిర్మించేశారు. ఒకప్పుడు నివాస ప్రాంతమైనా ఇటీవల వ్యాపార కేంద్రాలుగా మారిన చోట అనుమతులు లేకుండానే నిర్మాణాలు జరిపేశారు. అయితే రాజధాని బెంగళూరులో ఏడాదిలో నాలుగైదు భారీ భవనాలు కూలిపోయేలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దశాబ్దాల కిందట నిర్మించిన ఇళ్లపై భాగంలో కుటుంబాలు పెరిగాయని అంతస్తులు పెంచుకుంటున్నారు. పునాదులు పటిష్టంగా లేని కారణంగా వర్షాకాలంలో ఓవైపు వాలిపోతున్నాయి.

### ఎన్‌ఓసీ లేకుండానే భారీ కట్టడాలు

రాష్ట్రంలో 88శాతం బహుళ అంతస్తుల భవనాలకు ఎన్‌ఓసీలు పొందారు. 53శాతం భవనాలకు ఎన్‌ఓసీ మాత్రం పొంది అగ్నిమాపక శాఖ అనుమతులను పొందలేదు. 12శాతం మంది బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు లేవు. అగ్ని సురక్షిత అనుమతులు కూడా లేవు. ఈ భవనాలలో వాణిజ్యపరమైన వ్యవహారాలు, నివాసాలు, కార్యాలయాలతోపాటు వివిధ ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నట్లు అగ్నిమాపకశాఖ గుర్తించింది.

కుప్ప కూలుతున్న భవనాల సంఘటనలు తరచూ చోటు చేసుకుంటుడడంతో ప్రభుత్వం ప్రమాదకరంగా మారిన భవనాలను గుర్తించే ప్రక్రియ చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 32వేలకుపైగా భవనాలు ప్రమాద స్థాయిలో ఉన్నట్లు అంచనా వేశారు. ఇది ఓ ప్రమాద హెచ్చరికగా భావించాల్సిన అవసరం ఏర్పడింది. అగ్నిమాపకశాఖ ఇటువంటి భవనాలను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేసినా పట్టించుకోకుండా పోతున్నారు.

### నిబంధనలకు నీళ్లు..

గ్రౌండ్‌ఫ్లోర్ సహా 7 అంతస్తుల భవనాలు లేదా 15 మీటర్ల కంటే ఎత్తు కల్గిన భవనాలు కల్గినవారు అగ్ని ప్రమాదాల నుంచి సురక్షితమైన చర్యలు యాజమాన్యం చేపట్టాల్సి ఉంటుంది. కర్ణాటక అగ్నిమాపకశాఖ 1964 చట్టం ప్రకారం నేషనల్ బిల్డింగ్ కౌన్సిల్ భవనాల సురక్షతమైన చర్యలను ప్రస్తావించింది. కొత్త భవనం నిర్మించే వేళ యజమానులు అగ్నిమాపకశాఖకు దరఖాస్తు చేసుకుని అగ్నిసురక్షత మార్గదర్శకాలను పాటిస్తున్నామని ఒప్పందపత్రం నమోదు చేయాల్సి ఉంటుంది. భవన నిర్మాణం పూర్తయ్యాక అగ్నిమాపకశాఖ నుంచి అనుమతులు పొందాలి. ఆ తర్వాత భవనాలను వినియోగించాల్సి ఉంటుంది. రెండేళ్లకోసారి అగ్నిమాపకశాఖ నుంచి అనుమతులను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది.

### యజమానులకు నోటీసులు

అగ్నిసురక్షిత అనుమతులు లేకుండానే నిర్మించిన, ఆధునికీకరించిన భవనాల యజమానులకు అత్యవసరశాఖ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. ఎక్కువమంది నోటీసులకు స్పందించిన దాఖలాలు లేవు. రెండుసార్లు నోటీసులు జారీ చేసినా ఎటువంటి ప్రతిక్రియ లేకపోవడంతో చివరి నోటీసును జారీ చేసి ఆ తర్వాత విద్యుత్ సరఫరా నిలిపివేయాలని భావిస్తున్నారు. అత్యవసరశాఖ నోటీసులకు స్పందించని యజమానుల వివరాలను విద్యుత్‌శాఖకు పంపి వారి ద్వారా చట్టపరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. భద్రత లేని భవనాలలో వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలని సిఫారసు చేయనున్నారు. అగ్నిమాపకశాఖ అనుమతులు పొందేందుకు వ్యాపారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

బెంగళూరు నగరం వేగవంతంగా అభివృద్ధి చెందుతోంది. కొత్తగా ఏర్పాటు చేసుకున్న లే అవుట్లు, విస్తరించిన నగరంలో నివాసాలు, పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుపుతున్నారు. అక్కడ ఏకంగా 20-30 అంతస్తులకు పైగానే అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇటీవల రెండు దశాబ్దకాలంగా నిర్మిస్తున్న భవనాలకు సమగ్రమైన అనుమతులు ఉన్నాయి. కానీ అంతకంటే ముందు నిర్మించిన భవనాలదే సమస్యగా ఉంది. బెంగళూరులో అవెన్యూరోడ్డు, చిక్కపేట, బీవీకే అయ్యంగార్ రోడ్డు ప్రాంతాలలో వందేళ్లనాటి భవనాలు ఉన్నాయి. ఒకప్పుడు ఈ ప్రాంతం పూర్తిగా నివాసాలు కలిగింది. ఇటీవల మూడు దశాబ్దాలుగా పూర్తిగా వాణిజ్యకేంద్రంగా మారింది.

### అగ్నిమాపక శాఖ అధికారుల సర్వే..

రాజధాని బెంగళూరుతోపాటు రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో బహుళ అంతస్తుల భవనాలు సురక్షితం కానట్లు గుర్తించారు. భవనాలు కూలిపోయిన సంఘటనల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. లక్షలాది రూపాయల ఆస్తులు, వస్తువులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోంది. అగ్నిమాపక, అత్యవసరశాఖలు హెచ్చరించి సురక్షితమైన చర్యలకు సిద్ధం కావాలని సూచించినా పట్టించుకోకుండా సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అగ్నిమాపకశాఖ జరిపిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 60వేల దాకా బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. వీటిలో 50శాతం సురక్షితం కాదని నిర్ణయించారు. గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) పరిధితోపాటు మైసూరు, హుబ్బళ్ళి, ధారవాడ, బెళగావి, కలబురగి, బళ్ళారి, విజయపుర, దావణగెరె, మంగళూరు, శివమొగ్గ, తుమకూరు, మహానగర పాలికెల ప్రాంతాలలో సర్వే జరిపారు. ఈ కట్టడాలకు అగ్నిమాపకశాఖ నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదని తెలుస్తోంది

షాపింగ్ కాంప్లెక్స్ తరహాలో లేకున్నా నివాసానికి అనువైనటువంటి ఇళ్లను వ్యాపార కేంద్రాలుగా మార్చేశారు. ఈ ప్రాంతంలో కనీసం మరమ్మత్తులు చేయాలంటేనే వాహనాల రాక కష్టతరం అవుతుంది. ఇక నిర్మాణాలు చేపట్టాలంటే సాధ్యమయ్యే పరిస్థితి ఉండదు.

# కాలుష్య రహిత కర్ణాటకే లక్ష్యం

● రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల అమలుకు భారత్- స్వీడన్‌ల మధ్య ఒప్పందం

బెంగళూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : కార్బన్ ద్వారా తలెత్తే కాలుష్యం నివారించాలని, కాలుష్య రహిత కర్ణాటకే లక్ష్యంగా పరిశుభ్ర ఇంధనం దిశగా భవిష్యత్తును రూపొందించుకునేందుకు భారత్- స్వీడన్‌ల మధ్య కీలక ఒప్పందం జరిగింది. స్వీడిష్ ఇంధన సంస్థ అనుబంధమైన బిజినెస్ స్వీడన్-స్వీడిష్ ట్రేడ్ ఇన్వెస్ట్ కౌన్సిల్, భారత పరిశ్రమల సమాఖ్యకు అనుబంధమైన సొహ్రాబ్జి గోద్రెజ్ గ్రీన్ బిజినెస్ సెంటర్‌ల మధ్య క్లీన్ టెక్ విభాగం ద్వారా గురువారం ఒప్పందం చేసుకున్నాయి. 2012నుంచి ప్రారంభమైన పరస్పర సహకారం ద్వారా 75కు పైగా స్వీడిష్ క్లీన్‌టెక్ కంపెనీలను ఇండియన్ మార్కెట్ పరిచయం కాగా 250కి పైగా భాగస్వామ్య ప్రాజెక్టులు అనుకూలమైంది. మేక్‌ఇన్ ఇండియా, స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా జాతీయ ప్రయోజనాల కోసం దృష్టి సారించినట్లు ఐజీబీసీ బెంగళూరు ఛాప్టర్ ఛైర్మన్, ఆల్ట్‌టెక్ ఫౌండేషన్ ట్రస్టు సభ్యుడు డాక్టర్ చంద్రశేఖర్ హరిహరన్ అన్నారు. స్వీడన్ - ఢిల్లీ వ్యవహారాల ముఖ్యులు పవన్ తహ్లానీ మాట్లాడుతూ రెండు దేశాల మధ్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు పెంచాలని నిర్ణయించారు. ఇంటర్నేషనల్ మార్కెట్ డెవలప్‌మెంట్, పెట్టుబడుల విభాగం సీనియర్ బిజినెస్ హెడ్ నీల్స్ హెనోచ్, స్వీడన్ దేశానికి చెందిన ఢిల్లీ రాయబార కార్యాలయం ఆర్థిక సలహాదారుడు లుడ్విగ్ ఫోఫ్మర్ తదితరులు ఒప్పంద సమావేశంలో పాల్గొన్నారు.





ఒప్పంద పత్రాలతో కర్ణాటక, స్వీడన్ ప్రతినిధులు

# జీన్స్ పరిశ్రమకు ప్రభుత్వం అండ

● సీఈటీపీ కింద తక్షణ సాయం రూ. 22 కోట్లు : ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి ● సాయంపై యజమానుల హర్షం

బళ్లారి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బళ్లారిలో జీన్స్ పరిశ్రమకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో బళ్లారి జీన్స్ పరిశ్రమల సంఘం నాయకులు, మేయర్, పూజారి గాదెప్ప, మాజీ మేయర్ రాజేశ్వరి, ఇతర కార్పొరేటర్లతో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య బుధవారం బెంగళూరులో ఇండస్ట్రీయల్‌లో సమావేశం నిర్వహించారన్నారు. ముఖ్యంగా బళ్లారి జీన్స్ వ్యాపారులతో జరిగిన సమావేశంలో గత 15 రోజుల క్రితం బళ్లారిలో సుమారు 53 జీన్స్ వాషింగ్ యూనిట్లు కొన్ని కారణాలతో మూతపడిని విషయం తెలిసిందేనన్నారు. మూతపడిన 53 పరిశ్రమలకు అండగా నిలవడానికి తక్షణ సాయం కింద రూ. 22 కోట్లు మంజూరు చేశారన్నారు. మాజీ మంత్రి బి. నాగేంద్ర, నసీర్ హుసేన్, ఎంపీ తుకారాం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారని తెలిపారు. మూతపడిన ప్లాంట్లను తక్షణమే తెరిచేందుకు ఈపీటీకి సీఎం సూచించారు. కామన్ ఎఫిలేటెడ్ ట్రీట్‌మెంట్ ప్రాంట్(సీఈటీపీ) కొరకు ప్రభుత్వం కేఏఐడీబీ. నుండి రూ. 11 కోట్లు, కేకేఆర్‌డీబీ నుంచి రూ. 11 కోట్లు మొత్తం రూ. 22 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. బళ్లారిలో ప్రపంచ వ్యాప్త జీన్స్ అప్లేరియల్ పార్కును ఏర్పాటు చేసి రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలుపుకుంటామని తెలిపారు. అంతకు ముందు వాషింగ్ యూనిట్స్ జిల్లా సెక్రటరీ మల్లికార్జున గౌడ మాట్లాడుతూ జీన్స్ పరిశ్రమలకు సీఎం అండగా నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వీరితో పాటు బీఆర్‌ఎల్ శ్రీనివాస్, రాజేష్, వెంకటేష్ హెగ్డే, బోయపాటి విష్ణు హజరయ్యారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, వేదికపై మేయర్ గాదెప్ప, మాజీ మేయర్ రాజేశ్వరి, లేబుల్ రాజు తదితరులు

# రా..రమ్మని..!

## పుట్టపర్తిలో ఎన్నో రమణీయ స్థలాలు

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి రూరల్

ఊరికి తూర్పున చిందులు తొక్కే చిత్రావతి. చుట్టూ కొండలు. ఎంతో ఆహ్లాదం కలిగించే పచ్చదనం. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే వాతావరణం...ఇవీ ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లుతున్న పుట్టపర్తి నైసర్గిక స్వరూపానికి ప్రతీకలు. సత్యసాయి బాబా శత జయంతివేళ దేశం నలుమూలల నుంచే కాక ప్రపంచ దేశాల నుంచి సైతం అనేక మంది భక్తులు పుట్టపర్తికి వస్తున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి మహాసమాధి మాత్రమే కాక పుట్టపర్తిలో చూడదగ్గ మరిన్ని ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ఇలా..

### ● చైతన్యజ్యోతి మ్యూజియం



సత్యసాయిబాబా 75వ జన్మదినం సందర్భంగా 2000 సంవత్సరంలో చైనా మూరిష్ గోతిక్ జపనీస్ శైలిలో నిర్మించిన అద్భుత భవనం చైతన్య జ్యోతి మ్యూజియం ప్రారంభించబడింది. ప్రత్యేక ఆకర్షణతో బాబా జీవితం, వారి ప్రపంచసేవామిషన్‌పై రూపొందించిన అంశాలు ఇందులో ఉంటాయి. ఏడు విభిన్న విభాగాలుగా సృజనాత్మకంగా ఏర్పాటు చేసిన మల్టీమీడియా ద్వారా బాబా జననం, బాల్యం, అవతార ప్రవచనాలు బాబా దివ్యమిషన్ ముఖ్యఘట్టాల ప్రదర్శన సందర్శకులకు మధురానుభూతిని ఇస్తుంది. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఈ చైతన్య జ్యోతి మ్యూజియాన్ని ఉచితంగా సందర్శించవచ్చు. సోమవారం సెలవు.

### ● శాంతివేదిక


హిల్‌వ్యూ స్టేడియంలో ఏ కార్యక్రమం జరిగినా ప్రధాన వేదిక శాంతివేదికపై సత్యసాయి బాబా ఇతర ప్రముఖులు ఆశీనులై కార్యక్రమాలను వీక్షించేవారు. ప్రస్తుతం శతజయంతి ఉత్సవాలను సైతం దేశప్రధాని నరేంద్రమోదీ, గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులు శాంతివేదికపై ఆశీనులై వీక్షించారు.

### ● సత్యసాయి స్పేస్ థియేటర్



ప్రశాంతినిలయం విద్యాగిరి విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న సత్యసాయి స్పేస్ థియేటర్ గ్రామీణప్రజలకు ఖగోళశాస్త్రం, విజ్ఞానం గురించి అవగాహన కల్పించడానికి స్థాపించబడింది. ఇక్కడ ప్రతిరోజు జరిగే ప్రదర్శనలకు ప్రవేశం పూర్తిగా ఉచితం. తెలుగు ఇంగ్లిషు, హిందీభాషలలో ఉదయం 10.30 గంటలకు ప్రవేశం ఉంటుంది.

### ● సనాతన సంస్కృతి మ్యూజియం



1990లో స్థాపించిన మొట్టమొదటి మ్యూజియం ఇది. మానవ ఆధ్యాత్మిక వికాసాన్ని ప్రపంచంలోని ప్రధాన మతాల విలువలను శిల్పాలు, చిత్రాలు ప్రదర్శన రూపంలో ఇక్కడ చూపిస్తారు. సత్యసాయి బాల్యలీలలు, అవతార ప్రకటన ముఖ్యాంశాలు ఇందులో ఉంటాయి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉచితంగా ప్రవేశం ఉంటుంది. బుధవారం సెలవు.

### ● ధ్యానవృక్షం (వటవృక్షం)



1959లో సత్యసాయి స్వయంగా నాటిన మొక్క వట వృక్షంగా మారింది. దీనిపై సత్యసాయిబాబా ప్రతిష్ఠించిన యంత్రం కారణంగా ఇక్కడ ధ్యానం చేయడం సాధకులకు పుణ్యప్రదం అన్ని భక్తుల నమ్మకం. పగటి సమయంలో మాత్రమే, ప్రవేశం ఉచితం.

### ● అతిపెద్ద హనుమాన్ విగ్రహం



సత్యసాయి బాబా 65వ జన్మదినాన్ని పురస్కరించుకుని హిల్‌వ్యూస్టేడియంలో 65 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 1990 నవంబరు 22న సత్యసాయి ఈవిగ్రహాన్ని ఆవిష్కరించారు. హనుమాన్ విగ్రహంతో పాటు బుద్ధ, శివ, కృష్ణ, జీసస్, జొరాస్టర్ విగ్రహాలను ఏర్పాటు చేశారు.

### ● హిల్‌వ్యూ స్టేడియం



పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన అద్భుత క్రీడా ప్రాంగణం హిల్‌వ్యూ స్టేడియం. సత్యసాయి విశ్వవిద్యాలయ పరిధిలో భాగంగా ఈస్టేడియాన్ని అద్భుతంగా నిర్మించారు. దేశ విదేశాల నుంచి వచ్చే సందర్శకులు, భక్తులు ఇక్కడ ప్రతిఏటా జనవరి 11న జరిగే క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. 1997లో సత్యసాయి యూనిటీ కప్ పేరిట ఇండియాలెవన్, వరల్డ్‌లెవన్ జట్ల మధ్య ప్రత్యేకమైన క్రికెట్ పోటీని నిర్వహించారు. నాటి మ్యాచ్ సచిన్‌టెండూల్కర్ 88 పరుగులతో విజృంభించడంతో ఇండియా లెవన్ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది.

తర్వాత బ్యాటింగ్ చేసిన వరల్డ్ లెవన్ జట్టు 26.2 ఓవర్లలోనే 165 పరుగులకు కుప్పకూలింది. ఆ మ్యాచ్‌కు ముఖ్యఅతిథులుగా అప్పటి ప్రధాని ఐకే గుజ్రాల్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భారత మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ హాజరయ్యారు.

### ● సమాధి మందిరం



సత్యసాయిబాబా మాతాపితలు పెద్దవెంకమరాజు, ఈశ్వరాంబ సమాధులు ఉన్న ప్రాంతం ఇది. ప్రతి సంవత్సరం మే 6న ఈశ్వరాంబడే ఘనంగా జరుగుతుంది. ఇక్కడ ప్రత్యేక భజనలు, పూజలు, అన్నప్రసాదం జరుగుతాయి. ఉదయం సాయంత్రం ప్రవేశం ఉచితం.

**● గోపాలస్వామి ఆలయం:** పుట్టపర్తి పురాతన నామం గొల్లపల్లి. గోమాతలను రక్షించేందుకు నిర్మించిన గోపాలస్వామి అలయం గ్రామచరిత్రలోని శాప-పరిహార కథతో అనుబంధం కలిగిఉంది.






**● సత్యమ్మ ఆలయం:** సత్యసాయిబాబా తాత కొండమ రాజు నిర్మించిన అలయం సత్యమ్మ ఆలయం. ఇక్కడ అమ్మవారు గ్రామదేవతగా కొలువుతీరి, భక్తుల పూజలందుకుంటున్నారు.

### ● కలలో చూసి..: రాబర్ట్‌బుస్సీ ఫ్రాన్సు

40 సంవత్సరాలుగా ప్రశాంతి నిలయానికి వస్తున్నా. అంతకుముందు ఒకరోజు రాత్రి 'ప్రశాంతి నిలయానికి రా. అక్కడ నీకు అంతులేని ప్రశాంతత ఇస్తా' అని కలలో కనిపించి చెప్పారు. తెల్లవారిన తర్వాత నాకు ఏమి అర్థం కాలేదు. మరు నాడు ప్యారిస్‌లో పెద్ద పార్టీ జరిగింది. ఆ పార్టీకి నాకు సంబంధం లేకపోయినా ఆహ్వానం వచ్చింది. వెళ్లాను. అక్కడ హోటల్ గదిలో అంతకు మునుపు ఉన్నవారు స్వామి ఫొటో మరిచిపోయారు. ఆ ఫొటోలో బాబాను మొట్టమొదటి సారి చూశా. అంతకు ముందు రోజు రాత్రి కలలో చూసిన వ్యక్తి ఆ ఫొటోలో ఉన్న వ్యక్తి ఒక్కరే. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వెంటనే ఇండియాకు వచ్చా. నేను ఇండియాకు రావడం అదే తొలిసారి. ఇక్కడ అడుగు పెట్టగానే ఏదో తెలియని ప్రశాంత అనుభూతి కలిగింది. ప్రశాంతినిలయానికి వచ్చిన రోజు సాయంత్రమే స్వామి నాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఒక రింగ్ బహూకరించారు. నాటి నుంచి ప్రతి ఏటా ప్రశాంతి నిలయానికి వస్తున్నా.



### ● శివాలయం.. బాబా జన్మస్థలం

సత్యసాయి బాబా జన్మించి, బాల్యం గడిపిన పవిత్ర గృహం ప్రస్తుతం శివాలయంగా నిర్మించబడింది 1979లో బాబా ఆలయాన్ని స్వయంగా ప్రారంభించారు.



**● కల్పవృక్షం:** పుట్టపర్తి చిత్రావతి నది ఒడ్డున ఓబులదేవరగుట్టపై ఉన్న ప్రసిద్ధ చింతచెట్టు కల్ప వృక్షంగా పేరు గడించింది. సత్యబాబా చిన్నతనంలో తన భక్తులు కోరిన పండ్లను ఈ వృక్షం నుంచి తీసి ఇచ్చారని స్థల పురాణం చెబుతోంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రవేశం ఉచితం

**● పాతమందిరం.. పెదవెంకమరాజు కల్యాణమండపం**

1945లో మొదట బాబా ఆలయాన్ని ప్రారంభించారు. పాత మందిరంగా పలుస్తారు. తరువాత బాబా ప్రశాంతినిలయాన్ని 1950లో నిర్మించడంతో పాతమందిరం వివాహమందిరంగా మారింది.

---

# జిల్లాలో రహదారులను అభివృద్ధి చేస్తాం



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రాలు అందజేస్తున్న మంతులు, ఎమ్మెల్యేలు

పుట్టపర్తి టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారు. పుట్టపర్తి పర్యటనకు వచ్చిన ఆయన గురువారం సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాస అతిథి గృహంలో జిల్లాలో రహదారుల ప్రగతిపై రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవిత, సత్యకుమార్ యాదవ్, ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల ఏర్పాటుపై ఆరాతీశారు. ఎమ్మెల్యేలు, పరిటాల సునీత, ఎంఎస్ రాజు, పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తమ నియోజకవర్గాల్లో రహదారుల పరిస్థితిపై కేంద్రమంత్రితోపాటు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పెనుకొండ వద్ద జాతీయ రహదారి-44 నుంచి కొత్తచెరువు, పుట్టపర్తి, నల్లమాడ, ఓబుళదేవరచెరువు, మహమ్మదాబాద్ క్రాస్, సీజీ ప్రాజెక్టు, కొక్కంటి క్రాస్ మీదుగా చెన్నై జాతీయ రహదారితో కలపాలని కేంద్రమంత్రిని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో నూతన ఆర్అండ్‌బీ రోడ్లు, దెబ్బతిన్న బీటీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు. నియోజకవర్గంలో రహదారులులేని గ్రామాల వివరాలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. అనంతరం పుట్టపర్తి నుంచి బెంగళూరుకు బయలుదేరిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, సామకోటి ఆదినారాయణ, టీడీపీ నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, గంగాధర నాయుడు, సురేష్ చౌదరి, పీసీ గంగన్న, బీజేపీ నాయకులు లాయర్ హరికృష్ణ, జ్యోతి ప్రసాద్, సునీల్ వైట్ల, సూర్యనారాయణ, కల్యాణ్ కుమార్, నారాయణ, రామాంజి, రాయల్ మురళి పాల్గొన్నారు.

### విస్తరించాలి

కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలో జాతీయ రహదారులను మరింత విస్తరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. కేంద్ర మంత్రిని కోరారు. ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గం, హిందూపురం పార్లమెంటు పరిధిలో శరవేగంగా పారిశ్రామికాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ముదిగుబ్బ నుంచి పెనుకొండ మీదుగా చెళ్లకెర వరకు అంతర్రాష్ట్ర రహదానిని విస్తరించాలనీ, సోమందేపల్లి నుంచి హిందూపురం, దొడ్డబళ్లాపురం మీదుగా యలహంక వరకు వెళ్లే రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చాలనీ, హైదరాబాద్-బెంగళూరు ఎన్‌హెచ్-44ను ఆరులైన్ల రహదారిగా విస్తరించాలని కేంద్రమంత్రిని ఆమె కోరారు.

### జిల్లా కేంద్రంతో అనుసంధానించాలి

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో చేపట్టిన జాతీయ రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# అమృత్ పనులను వేగవంతం చేయాలి

● కలెక్టర్ ఆనంద్


అనంతపురం కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమృత్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ సెక్టార్‌పై పబ్లిక్ హెల్త్, నగరపాలక సంస్థ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పబ్లిక్ హెల్త్ పరిధిలో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయా పనుల్లో ప్రతివారం పురోగతి తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లను పెంచాలని ఆదేశించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ ఆదినారాయణ, మున్సిపల్ ఆర్డీ నాగరాజు, అనంత నగరపాలక సంస్థ డీసీ పావని పాల్గొన్నారు.

# నేడు పుట్టపర్తికి మహారాష్ట్ర సీఎం రాక

పుట్టపర్తి టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ శుక్రవారం పుట్టపర్తికి రానున్నారు. ఉదయం 9.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం ప్రశాంతి నిలయం చేరుకుని, సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొంటారు. తర్వాత ముంబై బయలుదేరి వెళతారు. సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొనడానికి శనివారం ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య కూడా పుట్టపర్తికి వస్తున్నారు.

# సత్యసాయి స్టాంపులు.. గంటలోనే సేల్

పుట్టపర్తి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విడుదల చేసిన పోస్టల్ స్టాంపులు గంటలోపే అమ్ముడయ్యాయి. హిందూపురం డివిజన్‌కు 1200 స్టాంపులను విడుదల చేయగా.. అన్నీ అయిపోయాయని పోస్టల్ సూపరింటెండెంట్ (హిందూపురం డివిజన్) విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. త్వరలోనే స్టాంపులను అందుబాటులోకి తెస్తామన్నారు.




ప్రధాని మోదీ విడుదల చేసిన సత్యసాయి పోస్టల్ స్టాంపులు

# నిస్వార్థ సేవాదళ్..!

పుట్టపర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవలకు సత్యసాయి సేవాదళ్ నిదర్శనమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు, ప్రతినిధులు కొనియాడారు. సత్యసాయి బోధనలే వారిని సేవామార్గంలో నడిపిస్తున్నాయని అన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతు మందిరంలో గురువారం శ్రీసత్యసాయి 11వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు రత్నాకర్, చక్రవర్తి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయి విద్యార్థుల వేద పఠనంతో కార్యక్రమం మొదలైంది. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి గడ్కరీ, మొదట సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం సదస్సులో ప్రసంగించారు. సత్యసాయి జీవితం, బోధనలు, విలువలు, ప్రేమతత్వం, మానవాళిని శాంతి జీవనం వైపు నడిపిస్తున్నాయని అన్నారు. ఇక్కడి భక్తి, సేవలను చూసి.. మరిన్ని మంచి పనులు చేసేందుకు ప్రేరణ పొందాలని వచ్చానని తెలిపారు.

### సేవాదళ్‌కు ముఖ్యమైన సదస్సు..

భగవాన్ సత్యసాయిబాబా అందించిన సేవ, ప్రేమ, స్ఫూర్తితో సేవాదళ్ సభ్యులు సేవలు నిర్వహిస్తున్నారని, నిస్వార్థసేవలకు వారు నిదర్శనంగా నిలుస్తున్నారని సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే అన్నారు. సేవాదళ్ సభ్యులకు ఈ సదస్సు చాలా ముఖ్యమైనదని అన్నారు. భగవాన్ సత్యసాయి బాబా తన ప్రేమ, ఆధ్యాత్మిక బోధనలతో లక్షల మంది భక్తులను సేవా మార్గంవైపు పయనించేలా చేశారని అన్నారు. సత్యసాయి సేవాదళ్ సభ్యులు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా తమ తమ ప్రాంతాలలో విద్య, వైద్యం, తాగునీరు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సేవలు, యువతకు ఉపాధిపై శిక్షణ, బాలవికాస్ విద్య ద్వారా బోధన అందిస్తున్నారని అన్నారు. సత్యసాయి మార్గమే తమకు శిరోధార్యం అని, అదే సేవాదళ్‌కు స్ఫూర్తి అని అన్నారు.



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి గడ్కరీ, నిమీష్‌పాండే, నాగానందం

### బాబా సేవలు ప్రపంచ వ్యాప్తం..

శ్రీసత్యసాయి 11వ అంతర్జాతీయ సదస్సుకు 45 దేశాల నుంచి 2500 మంది సేవాదళ్ ప్రతినిధులు హాజరయ్యారని సత్యసాయి సేవాసంస్థల యూకే ప్రతినిధి సురేశ్ మీనన్ అన్నారు. సత్యసాయి బాబా ఆధ్యాత్మిక బోధనలు, సేవలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయని, భక్తులను సేవలపై నడిపిస్తున్నాయని అన్నారు. నేపాల్, ఇంగ్లండ్, అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ సహా పలు దేశాల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. సత్యసాయి సేవాదళ్ బ్రాంచ్‌లు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి, నిస్వార్థ సేవలు అందిస్తున్నాయని తెలిపారు. 75 మంది విదేశీ డాక్టర్లు, 200 మంది భారతీయ డాక్టర్లు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. మనిషి హృదయమనే ఇంటిలో శాంతి అనే దీపం వెలిగించినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని అన్నారు. దీనికోసం సేవాదళ్ సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక బోధనలు కొనసాగిస్తున్నారని అన్నారు. ఎలాంటి అనుకూలత, వసతి లేని చోట సత్యసాయి సేవాదళ్ సభ్యులు సేవా కార్యక్రమాలను అంకితభావంతో కొనసాగిస్తున్నారని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానందం అన్నారు. సత్యసాయి భక్తులు, సేవాదళ్ ప్రపంచాన్ని వసుధైక కుటుంబంగా భావిస్తారని అన్నారు. ఎక్కడ ఎలాంటి విపత్తు, ఆపద ఎదురైనా అక్కడికి వెళ్లి అవసరమైన సేవలను అందిస్తారని కొనియాడారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### సర్ సీవీ రామన్ (వర్ధంతి)



భారతరత్న గ్రహీత 'సర్ చంద్రశేఖర్ వెంకట రామన్ (సీవీ రామన్) 1888 నవంబరు 7న తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి (ట్రిచీ, తిరుచ్చి) సమీపాన అయ్యన్ పెటాయ్ గ్రామంలో జన్మించారు. మెట్రిక్యులేషన్‌లో ఫిజిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. ఎంఎస్సీ ఫిజిక్స్‌లో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. కాంతి తరంగాలపై ఆయన చేసిన పరిశోధన 'రామన్ ఎఫెక్ట్'గా పేరొందింది. 'రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరించిన ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించారు. రాజగోపాలాచారి, సర్వేపల్లి రాధాకృష్ణన్‌లతో కలసి అందుకున్న తొలి 'భారతరత్న'. అంతేకాక సైన్స్‌లో నోబెల్ ప్రైజ్ అందుకున్న తొలి ఆసియా శాస్త్రవేత్తగా నిలిచారు. బెంగళూరులోని ఐఐఎస్సీకి తొలి డైరెక్టర్‌గా వ్యవహరించిన ఘనత ఆయనది. ఫిజిక్స్‌లో ఎన్నో పరిశోధనలతో పలు గౌరవాలు పొంది ఆయన 1970 నవంబరు 21న కన్నుమూశారు.

### ఆనంది బెన్ (పుట్టినరోజు)



ఉత్తరప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరిస్తున్న ఆనందిబెన్ మఫత్‌భాయ్ పటేల్ 1941 నవంబరు 21న గుజరాత్ రాష్ట్రం మెహ్సానా జిల్లా విజాపూర్ తాలూకా ఖరోడ్ గ్రామంలో జన్మించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి ఇన్‌చార్జ్ గవర్నర్‌గా వ్యవహరించారు. గుజరాత్ రాష్ట్ర తొలి మహిళా సీఎంగా వ్యవహరించిన ఘనత ఆమెది. గుజరాత్‌లో ఉత్తమ టీచర్‌గా గవర్నర్, ప్రెసిడెంట్స్ బ్రేవరీ అవార్డు అందుకున్నారు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి బీజేపీలో చేరి రాజకీయాల్లో రాణించారు. 1994లో రాజ్యసభ సభ్యురాలిగా చేరారు. ఆ తర్వాత ఎమ్మెల్యేగా కూడా గెలుపొందారు. 2014లో వందమందిలో అత్యంత ప్రభావశీలురులో ఒకరిగా నిలిచారు. విద్యాగౌరవ్, సర్దార్ పటేల్ అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు.

## గుడిపాలలో బెంగళూరు పోలీసులు

● రూ.7 కోట్ల దోపిడీ ముఠా కోసం గాలింపు ● వాహనాన్ని వదిలేసి వెళ్లిన దుండగులు

చిత్తూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో రూ.7.11 కోట్ల నగదును దుండగులు బుధవారం పట్టపగలే దోపిడీ చేసిన విషయం తెలిసిందే. ఆ వాహనాన్ని బుధవారమే చిత్తూరు జిల్లా గుడిపాల పోలీస్‌స్టేషన్ పరిధిలో వదిలేసి వెళ్లిపోగా, బెంగళూరు పోలీసులు వెతుక్కుంటూ గురువారం గుడిపాలకు వచ్చారు. వివరాల్లోకి వెళితే.. బెంగళూరు నగరం జేపీనగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి నగదు తీసుకుని ఏటీఎంలో నింపడానికి ఓ ఏజెన్సీ వాహనంలో బుధవారం సిబ్బంది వెళుతుండగా.. జయనగర్ సౌత్ ఎండ్ సర్కిల్‌లో 'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా' అనే స్టిక్కర్ అతికించి ఉన్న కేఏ03 ఎన్‌సీ 8052 నంబరు ఇన్నోవా కారు వచ్చి అడ్డగించింది. తాము ఐటీ అధికారులమని బెదిరించి, డ్రైవర్ మినహా గన్‌మెన్, మరో ఉద్యోగిని వాహనం నుంచి దించేశారు. ముఠాలోని ఇద్దరు వ్యక్తులు నగదు ఉన్న ఏజెన్సీ వాహనంలోకి ఎక్కి డెయిరీ సర్కిల్‌లోని జయదేవ ఆసుపత్రి వైపు మళ్లించారు. అక్కడి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఏజెన్సీ వాహనాన్ని ఆపి, అందులోని నగదును ఇన్నోవా కారులోకి మార్చారు. తర్వాత ఇన్నోవాలో ఆ ముఠా పారిపోయింది. అలా పారిపోయిన ఆ ముఠా బుధవారమే గుడిపాల సమీపంలో ఆ ఇన్నోవాను వదిలేశారు. అక్కడి నుంచి మరో వాహనంలో తమిళనాడు వైపు వెళ్లిపోయారా.. గుడిపాల మండలంలోనే ఏదో ఓ ప్రాంతంలో నక్కి ఉన్నారా.. అనేది పోలీసులు తేల్చాల్సి ఉంది. పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ స్వయంగా విచారణను పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. అందులో ఓ బృందం గురువారం గుడిపాలకు చేరుకుని ముఠాకు చెందిన ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి వచ్చిన బృందంలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు తమ సిబ్బందితో కలిసి గుడిపాల మండలంలోని చిత్తపార, రామాపురం వంటి గ్రామాలతో పాటు అటవీ ప్రాంతాల్లో కూడా ముఠా కోసం గాలిస్తున్నారు. స్థానిక పోలీసులు వారి వెంట వెళ్లి సాయం చేస్తున్నారు.

## విత్తన పంపిణీకి దరఖాస్తు చేసుకోండి

● ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీజీ చిదానందప్ప

హొస్పేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) ఎస్సీ, ఎస్టీ కుటుంబాల రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా కూరగాయల విత్తనాల పంపిణీ చేయనున్నట్లు ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరక్టర్ పి.జి చిదానందప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక ప్రాంత అభివృద్ధి బోర్డు ప్రభుత్వ విచక్షణా నిధి కింద జనరల్ సబ్ ప్లాన్ ప్రస్తుత సంవత్సరంలో ఉద్యానవన శాఖ అమలు చేస్తోందని షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల రైతులకు మంచి నాణ్యత గల కూరగాయల విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు అయన వెల్లడించారు. నాణ్యమైన విత్తనాలతో ఎటువంటి రసాయన ఎరువులు లేకున్నా మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. ప్రైవేట్ కంపెనీల మోసాలకు బలి కూకాడదన్నారు. ఆసక్తిగల షెడ్యూల్డ్ కులాలు, తెగల రైతులు సంబంధిత తాలూకాలోని సీనియర్ ఆసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు వివరాలు కోసం కార్యాలయంలో సిబ్బందిని కలిసి తెలుసుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించాలని రైతులు మోసపోరాదని ఆయన సూచించారు.

## 12 నుంచి ప్రత్యేక పార్సిల్ రైలు సేవలు ప్రారంభం

● మొదటి సారిగా రాయపురం నుంచి మంగళూరుకు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురం నుంచి కేరళ రాష్ట్రం మీదుగా, కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు ప్రత్యేక వారాంతపు పార్శిల్ సేవలు డిసెంబరు 12 నుంచి ప్రారంభం కానున్నాయి. దక్షిణ రైల్వే పరిధిలో మొదటి సారిగా పార్శిల్ రైలు సేవలు ప్రారంభం కానుండడం విశేషం. మంగళూరు సెంట్రల్ నుంచి డిసెంబరు 12న బయల్దేరే రైలు మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు రాయపురం చేరుకుంటుంది. రాయపురం నుంచి ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 2.20 గంటలకు మంగళూరు సెంట్రల్ చేరుకుంటుంది. దుస్తులు, మోటారు విడిభాగాలు, ఉక్కు ఉత్పత్తులు, చేపలు వంటి వాటిని రవాణా చేసేందుకు ఈ రైలు సౌకర్యంగా ఉంటుందని దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. సేలం, ఈరోడ్, ఊత్తుకులి, తిరుప్పూర్, కోయంబత్తూర్, కోళికోడ్ తదితర ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో ఈ రైలుకు లోడింగ్, అన్‌లోడింగ్‌కు వసతులు ఏర్పాటు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.



## 'డిజిటల్ అరెస్ట్' పేరుతో రూ.24 లక్షల మోసం

● మైసూరుకు చెందిన ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'డిజిటల్ అరెస్ట్' పేరుతో రూ.24 లక్షల మోసానికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక తండయార్‌పేటకు చెందిన చిత్రలేఖ (70) తండయార్‌పేటలోని నార్త్ జోన్ సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో అందజేసిన ఫిర్యాదులో వివరాలిలా ఉన్నాయి... సెప్టెంబరు 25వ తేది తనకు ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తి, మానవ అక్రమ రవాణా కేసులో ప్రమేయం ఉన్నందున నా ఆధార్ నెంబరు, మొబైల్ ఫోన్ బ్లాక్ చేయబోతున్నట్లు తెలిపాడు. అనంతరం వాట్సాప్ వీడియో కాల్‌లో మాట్లాడిన వ్యక్తి, తాను గాంధీ నగర్ పోలీసు మదన్‌కుమార్‌గా పరిచయం చేసుకుని, నా ఆధార్ కార్డు, సుప్రీంకోర్టు ఉత్తర్వులు అని చూపించి 'డిజిటల్ అరెస్ట్' చేయబోతున్నట్లు తెలిపాడు. అనంతరం మరో వ్యక్తి, సీబీఐ అధికారినంటూ పరిచయం చేసుకుని, నా బ్యాంక్ ఖాతాలోని నగదు, తను చెప్పిన బ్యాంక్ ఖాతాకు బదిలీ చేయాలని, విచారణ అనంతరం నగదు తిరిగి పంపిస్తామని తెలిపాడు. ఈ మాటలతో భయాందోళనలకు గురై, తన ఖాతా, తన భర్త ఖాతాల్లో ఉన్న రూ.27 లక్షలను, ఆ వ్యక్తి పేర్కొన్న బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసి, ఆ తర్వాత తాము మోసపోయామని గుర్తించామని, తమ డబ్బు తిరిగి అప్పగించేలా చర్యలు చేపట్టాలని చిత్రలేఖ సైబర్ క్రైం పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో తెలియజేసింది. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు, చిత్రలేఖ నగదు పంపిన బ్యాంక్ ఖాతా నెంబరు, ఆమెకు వచ్చిన సెల్‌ఫోన్ నెంబరుపై విచారించగా, అవి కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందినవిగా గుర్తించారు. మైసూరు చేరుకుని విచారణ చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు ఆ ప్రాంతానికి చెందిన తేజాస్, ప్రణవ్, మహ్మద్ సమీర్ లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## పక్కాగా పాఠశాలల సమాచారం

అనంతపురం విద్య, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ప్రభుత్వ యాజమాన్య పాఠశాల సమాచారం పక్కాగా సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేపట్టారు. అన్నిమండలాల విద్యాధికారు(ఎంఈఓ)లు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గురువారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌కు వచ్చారు.అక్కడ ఆయా మండలాలు, పాఠశాలల వారీగా రాష్ట్ర అధికారులు ఆదేశించిన మేరకు పనిచేస్తున్న టీచర్ల వివరాలు, వారి పొజిషన్‌ఐడీలు, క్యాడర్ స్ట్రెంథ్, ఓఆర్‌జీఐడీ సమాచారాన్ని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో పక్కాగా సమాచారం తీసుకుని, అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో వివరాలను ఐటీ సెల్ సిబ్బంది ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు నమోదు చేశారు. ఇందులో పొరబాట్లు దొర్లితే ఆయా ఎంఈఓలు, హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందని డీఈఓ ప్రసాద్‌బాబు హెచ్చరించారు.

## టమోటా @ 50

భారీగా పెరిగిన ధర

అనంతపురంరూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా ధర భారీగా పెరిగింది. కిలో ధర ఏకంగా రూ.50కి చేరింది. కొన్ని రోజులుగా మార్కెట్‌లో టమోటాకు డిమాండ్ పెరిగింది. ఆశించిన స్థాయిలో మార్కెట్‌లో కాయలు లేకపోవడం, ఎగుమతి ప్రాంతాల్లో కూడా అదే పరిస్థితి ఉండడం ధర పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. గురువారం గరిష్టంగా కిలో రూ.50తో అమ్ముడుపోయాయి. కనిష్ఠంగా రూ.27, సరాసరి రూ.37తో విక్రయాలు జరిగినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,875 టన్నుల కాయలు వచ్చాయన్నారు.

## రేపు పంచాయతీల్లో గ్రామ సభలు

అనంతపురం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఈనెల 22న జాబ్ కార్డులు, అభ్యంతరాల స్వీకరణ కోసం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ సలీం బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభల్లో జాబ్ కార్డుల కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఉపాధి కూలీలకు ఈకేవైసీ చేసిన నేపథ్యంలో తొలగించిన కూలీల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. కూలీలకు పనులు కల్పించడంపైనా దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

## చారిత్రక సంపద పరిరక్షణ మన బాధ్యత

● డీఆర్‌డీఏ పీడీ శైలజ

అనంతపురం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చారిత్రక సంపదను పరిరక్షించుకోవడం సమాజంలోని ప్రతిఒక్కరి బాధ్యత అని డీఆర్‌డీఏ పీడీ శైలజ పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాకేంద్రంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాలలో నిర్వహించిన పురాతన నాణేల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురాతన నాణేలు, స్టాంపుల సేకరణలో గోవిందరాజులుగుప్త, శివప్రసాద్‌ల కృషి అభినందనీయమన్నారు. అతి ప్రాచీన మహాజనపదాల కాలాల నుంచి మధ్యయుగం నాటి మహమ్మదీయ రాజ్యాల కాలాలకు చెందిన బంగారు, వెండి, రాగి, ఇత్తడి నాణెములతోపాటు బ్రిటిష్ కాలం నాటి వివిధ రకాల నాణేలు, వివిధ దేశాలకు చెందిన స్టాంపులు ఇక్కడి పురావస్తు ప్రదర్శనశాలలో ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించి మన చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం మ్యూజియంను సందర్శించారు.



పురాతన నాణేల ప్రదర్శనను ప్రారంభిస్తున్న శైలజ

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాణిపేట సమీపంలో కారు-బైక్ ఢీకొన్న ఘటన లో ముగ్గురు యువకులు మరణించారు. రాణిపేట సమీపం నవల్‌పూర్‌కారై జంక్షన్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన రైల్వే వంతెనపై వేగంగా వచ్చిన కారు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌లో ప్రయాణిస్తున్న దినేష్ (20), సాజన్ (26), బాలమురుగన్ (19)లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వాలాజాపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్న ముగ్గురు మృతిచెందారు. రాణిపేట పోలీసులు కేసు నమోదుచేసి కర్ణాటక రిజిస్ట్రేషన్ ఉన్న కారు డ్రైవర్ కునుకు తీయడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. తల్లిదండ్రులు విషాదంలో మునిగారు.



మృతులు దినేష్, సాజన్, బాలమురుగన్ (ఫైల్‌ఫొటోలు)

## శతాధిక వృద్ధురాలి మృతి

రాయదుర్గంరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌సీ శేషాద్రి సతీమణి లీలావతమ్మ(103) గురువారం హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. లీలావతమ్మ గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవారని కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. కాగా ఎన్‌సీ శేషాద్రి 1955 నుంచి 62 వరకు రాయదుర్గం ఎమ్మెల్యేగా పని చేశారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



లీలావతమ్మ (ఫైల్)

## బాలిక అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్చెల్సీ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. అనంతపురం మూడో పట్టణ పోలీసులు గురువారం తెలిపిన వివరాల మేరకు హెచ్చెల్సీ కాలనీకి చెందిన వెంకటరమణారెడ్డి కుమార్తె మాచిరెడ్డి హరిత (17) నగరంలోని నలంద జూనియర్ కళాశాలలో ఇంటర్ వరకూ చదువుకుంది. అయితే తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా కనిపించకపోవడంతో. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థిని చామన ఛాయ రంగులో ఉంటారని, 5.3 అడుగుల ఎత్తు ఉన్న ఆమె ఆచూకీ తెలిపిన వారు 9490618679, 9346917115 నంబర్లను సమాచారం ఇవ్వాలని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ పేర్కొన్నారు.



మాచిరెడ్డి హరిత

## వ్యక్తి మృతి

నల్లమాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఈశ్వర్‌వాటర్ ప్లాంటు సమీపాన గుజిరీ సేకరించే ఆంజనేయులు (50) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కదిరి మండలంలోని కమ్మరవాండ్లపల్లి సమీపానగల బాబాకాలనీలో ఆంజనేయులు, తులసమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వారు గ్రామాలకు వెళ్లి గుజిరీ వస్తువులు ఏరుకుని, ఆటోలో వేసుకుని కదిరి పట్టణంలో విక్రయించి, జీవనం సాగిస్తున్నారు. ఈనెల 18న ఉదయం 7.30 గంటలకు ఆటోలో గ్రామాలకు వెళ్తున్నట్లు చెప్పి ఆంజనేయులు వెళ్లాడు. మంగళవారం నల్లమాడలో అతిగా మద్యం తాగి పడిపోయినట్లు సమాచారం. ఆ తర్వాత చనిపోయాడు. ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు చూడగా.. మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య తులసమ్మకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. తులసమ్మ ఫిర్యాదు మేరకే కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఆంజనేయులుకు నలుగురు కుమార్తెలున్నారు. ఒకరికి వివాహం కాగా.. ఇద్దరు డిగ్రీ, మరొకరు ఇంటర్ చదువుతున్నారు. తన భర్తకు తాగుడు అలవాటు ఉందనీ, అతిగా తాగి చనిపోయి ఉంటాడని తులసమ్మ పేర్కొన్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది.



ఆంజనేయులు (ఫైల్)

## కూలుతున్న పచ్చనిచెట్లు

● కర్ణాటకకు తరలుతున్న కలప ● పట్టించుకోని అధికారులు

గుడిబండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో పచ్చనిచెట్లు వ్యాపారుల చేతుల్లో కూలిపోతున్నా అటవీశాఖాధికారులు పట్టించుకోవడంలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పచ్చని చెట్లు నరికి లారీలు, టెంపోల్లో ట్రాక్టర్ల ద్వారా కలపను బెంగళూరు, తుమకూరు, మైసూరు, మధుగిరి, వసకెర తదితర ప్రాంతాలకు వ్యాపారులు పట్టపగలే తరలిస్తున్నా అటవీశాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎడారి నివారణకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కలు పెంచేందుకు ఉపాధిహామీ నీరు చెట్టు, వన సంరక్షణ సమితి తదితర ఎన్నో పథకాలకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తుంటే గుడిబండలో మాత్రం అందుకు విరుద్ధంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని కర్ణాటకకు కలప తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం

నియోజకవర్గంలో పచ్చని చెట్లు నరికి కర్ణాటక ప్రాంతానికి తరలించే వ్యాపారస్తులపై ప్రత్యేకంగా నిఘా ఉంచుతాం. ఎవరైనా చెట్లను నరికివేస్తే చర్యలు వెంటనే వారిపై చర్యలు తీసుకుంటాం.

- చాంప్లానాయక్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్



ట్రాక్టర్‌లో కలపను తరలిస్తున్న వ్యాపారులు



క్రీడాకారులతో సామాజిక కార్యకర్త రష్మిరాజశేఖర్ తదితరులు

## అమ్మాయిలు క్రీడల్లోనూ రాణించాలి

● సామాజిక కార్యకర్త రష్మి రాజశేఖర్

హొస్పేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) అమ్మాయిలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సామాజిక కార్యకర్త రష్మి రాజశేఖర్ అన్నారు. గురువారం శ్రబుూ హంపి విరూపాక్షేశ్వర స్వామి గ్రాడుయేట్ కళాశాలలో జరిగిన 15వ జూనియర్ కాలేజి బాలుర, బాలికల వాలీబాల్ టోర్నమెంట్ యూనివర్సిటీ సెలక్షన్ 2025 కు అమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రష్మి రాజశేఖర్, డీఎస్పీ మంజునాథ్ మాట్లాడుతూ వాలీబాల్ అంటే కేవలం ఆట కాదు క్రీడాస్ఫూర్తి మీ ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయికి చేరుకోవాలన్నారు. కళాశాలలో సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ బసవరాజ్ అన్నారు. ఈ టోర్నమెంట్‌లో బళ్లారి, విజయనగరం జిల్లాల నుంచి బాలుర జట్లు 19, బాలికల జట్లు 7 పాల్గొనగా పోటిలలో బాలికల జట్టులో విజయనగరం కళాశాల హొస్పేట్ మొదటి స్థానం సాధించగా, మాతాపడవి కళాశాల రెండవ స్థానం, వీరేశ్వ కళాశాల, బళ్లారి మూడవ స్థానంలో నిలిచాయని నిర్వహకులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న శాంతినికేతన్ అధ్యక్షుడు చలపతి కృష్ణ

సిరుగుప్ప నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాంతినికేతన హైస్కూలు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. బళ్లారిలో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విజేతలై రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో పలువురు వారిని అభినందించారు. భాగ్యలక్ష్మీ, వేదావతి, సన, తదితర విద్యార్థులు లాంగ్ జంప్, హైజంప్, రన్నింగ్ రేస్, క్రీడల్లో విజేతలయ్యారు. పాఠశాల అధ్యక్షుడు చలపతి కృష్ణ, ముఖ్య ఉపాధ్యాయులు ధర్మన్న, వ్యాయామ ఉపాధ్యాయులు చెన్నప్ప, అడివప్ప, విద్యార్థులను అభినందించారు.

## విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ



విద్యార్థులతో ఆదికేశవులు నాయుడు తదితరులు

బెంగళూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగు విజ్ఞాన సమితి ఉపాధ్యక్షులు ఆదికేశవులు నాయుడు నగర పరిధి కనకపురరోడ్ వాసుదేవపుర కన్నడ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సుమారు 90మంది విద్యార్థులకు 35వేల విలువైన వస్తువులను అందించారు. ఇదే సందర్భంగా ఆదికేశవుల నాయుడు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో కన్నడ మీడియంలో చదివే విద్యార్థులకు తనకు తోచినంత విధంగా సాయం చేశామన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులను ఇచ్చామన్నారు.

## నేటినుంచి తీర ప్రాంతాల్లో భారీ వర్షం

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చాయి. ఈ పరిస్థితుల్లో, నైరుతి బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడింది. ఈ కారణంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో శుక్రవారం నుంచి ఈ నెల 25వ తేది వరకు ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ ప్రకారం కడలూరు, నాగపట్టణం, తిరువారూరు. మైలాడుదురై, రామనాథపురం, విరుదునగర్, తెన్‌కాశి, కన్నియాకుమారి, తూత్తుకుడి, తిరునల్వేలి తదితర జిల్లాల్లో శుక్రవారం భారీవర్షాలు కురిసే అవకాశముంది. అలాగే, కడలూరు, మైలాడుదురై, నాగపట్టణం, తిరువారూరు, తంజావూరు, పుదుకోట, శివగంగ, రామనాథపురం, తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో ఈ నెల 22,23 తేదీల్లో భారీవర్షాలు కురిసే అవకాశముంది. మైలాడుదుర్రై, నాగపట్టణం, తిరువారూరు, తంజావూరు, పుదుకోట జిల్లాల్లో ఈ నెల 24, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, నాగపట్టణం, తిరువారూరు, తంజావూరు, పుదుకోట జిల్లాల్లో ఈ నెల 25వ తేది భారీవర్షాలు కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది.



### తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1624.08 | 1630.75 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 2,362 | 3,850 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 7,232 | 6,645 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 73.52 | 96.91 |

## ఉత్సాహంగా పోలీసు క్రీడలు



పరుగు పందెంలో విజేత ఎస్ఐ కాళింగ

బళ్లారిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీఆర్ గ్రౌండ్‌లో జరుగుతున్న పోలీసు క్రీడలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం జరిగిన ఐదు కిలోమీటర్ల పరుగు పందెం, 1500 మీటర్ల పరుగు పందెంలో మోకా పీఎస్ఐ కాళింగ మొదటి బహుమతి అందుకున్నారు. ఆయన్ని పలువురు ఎస్పీ శోభారాణి సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

### అమావాస్య పూజలు

మడకశిర టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరిరోజు కావడంతో పట్టణంలోని దేవాలయాల్లో విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిగాయి. స్థానిక షిరిడీ సాయినాథుడి ఆలయంలోని బాణలింగేశ్వరస్వామికి ద్రాక్ష, అన్నాభిషేకం నిర్వహించారు. షిరిడీసాయినాథుడికి, భోగిరామలింగేశ్వర స్వామి, చంద్రమౌళీశ్వరస్వామి, అభయ, కావలి కొండ, మిట్టబండ అంజనేయస్వామి ఆలయాల్లో అమావాస్య సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి.



మహాశివుడికి అలంకరణ

# కష్టాలను మిగిల్చిన ఖరీఫ్

● తడిసిన ధాన్యం కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు ● లబోదిబోమంటున్న రైతులు

కంప్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆయకట్టు రైతులకు ఖరీఫ్ నష్టాన్నే మిగిల్చింది. అకాల వర్షాలతో నిండా మునిగిపోయామని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్లు, వైరస్ కారణంగా పంట దిగుబడి భారీగా పడిపోయింది. ఎకరం 40 బస్తాల నుంచి 50 బస్తాల వరకు దిగుబడి వచ్చే పొలాల్లో కూడా కేవలం 25 నుంచి 30 వరకు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. పంటలకు పెట్టుబడులు మాత్రం రూ. 30 వేల నుంచి రూ. 40 వేలు వచ్చిందని, కనీసం పెట్టుబడులు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు. కౌలు రైతులు మరింత నష్టాలపాలయ్యామని, నష్టాలతో ఆత్మహత్యలే శరణమ్మని వాపోతున్నారు. దీనికి తోడు రబీ పంటకు నీరు లేకపోయేసరికి రైతుకు ఎనలేని కష్టాలు ఎదురయ్యాయి. అంతో ఇంతో చేతికొచ్చిన పంటను అమ్ముకుందామంటే వరిధాన్యం కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని, దీంతో మరింత నష్టపోతున్నామని వాపోతున్నారు. సోనా 75కిలోలు 1700 వందలు ఆర్ఎన్ఎస్ రకం వరి ధాన్యానికి 18 నుండి 19 పలుకుతున్నాయి. కానీ రెండు మూడు రోజులుగా వాతావరణంలో మార్పు రావడంతో, వర్షం భయంతో వ్యాపారులు కొనుగోళ్లకు ముందుకు రావడం లేదు. వరిధాన్యం మాత్రం పొలాల్లో కోసి రోడ్లపైన అమ్మకాలకు అమ్మకానికి సిద్ధం చేశారు. కొనుగోలు దారుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రైతుకు కొద్దిపాటి రేట్లు లభించిన అమ్మకాలు చేస్తున్నారు. వాతావరణ మార్పు వల్ల ఖరీఫ్ సీజన్‌లో రైతుకు కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు.



రోడ్లపై అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం



గిరిజన మహిళలకు టార్పాలిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

## ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోండి

● మహిళలకు టార్పాలిన్ల పంపిణీలో ఎమ్మెల్యే గణేశ్

కంప్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు పేద కుటుంబాల వారు ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గణేష్ సూచించారు. కురుగోడులో గురువారం కంప్లి నియోజకవర్గంలోని సంచార జాతులు ఎస్సీ, ఎస్టీ గిరిజన వర్గాల గుడారాలకు ఆశ్రయం కల్పించడానికి ప్రభుత్వం అందించిన టార్పాలిన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని హక్కి పిక్కి సిండోల్లో డోంగ్రిగరాషి, శిలేఖ్యత, సుడుగాడు సిద్ధ, తెగ, జంగం, హండి, జోగి, ఇతర సంచార జాతులకు టార్పాలిన్లను పంపిణీ చేసామన్నారు. రాబోయే రోజుల్లో స్థలాలు, ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం సులభతరం చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అలేమారి, అరి అలేమారి మహాసభ అధ్యక్షులు శివకుమార్, శికారి రాము, హనుమంతప్ప, జోగి సుంకప్ప హండిజోగి, హులుగప్ప, సుడుగాడు సిద్ధ, ఇతర సంచార జాతుల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రతి నెలా రాజ్యోత్సవం జరుపుకోవాలి

● ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి

గంగావతి రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) కర్ణాటక రాజ్యోత్సవాన్ని నవంబర్‌లో మాత్రమే కాకుండా ప్రతి నెల ఉత్సవంలా జరుపుకోవాలని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం గంగావతి బస్టాండ్‌లో కన్నడ అనుకూల సంస్థల కూటమి ఆధ్వర్యంలో జరిగిన 70వ రాజ్యోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని భాషలో మాట్లాడేవారికి గౌరవం ఇవ్వాల్సిందేనని, 70 ఏళ్ల కర్ణాటక ప్రస్థానం గర్వించదగ్గదన్నారు. రాష్ట్ర గౌరవం కన్నడ అభిమానాన్ని పెంపొందించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహిచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ పరవన్నమనువల్లి, కొప్పళ ఎంపీ రాజశేఖర్ హిట్నాల్, బీజేపీ నాయకులు సింగనాళ్ విరుపాక్షప్ప, నేక్కిటి సూరిబాబు, కన్నడ అనుకూల సంఘం అధ్యక్షుడు చన్నబసవ, జాకీ, అర్జున్ నాయక్, పంపన్ననాయక్, ఆర్.జె.శ.రెడ్డి, బళ్లారి రామన్న, మనోహర్ గౌడ్, యమనూరు చౌడికి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతపై వార్డుల్లో అవగాహన



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కంప్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణం 20వ వార్డుల్లో ప్రజలు తమ చుట్టూ వుండే ప్రదేశంలో పరిశుభ్రంగా వుంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పట్టణ పంచాయతీ నైరమల్య శాఖ నళిని, యాస్మిన్‌లు తెలిపారు. బుధవారం కుడితిని పట్టణంలో పలు వాడల్లో స్వచ్ఛ జాగృతి కార్యక్రమాలు చేపట్టారు. ఇళ్లలోని మహిళలు తమ ఇళ్లల్లో వుండే చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా పట్టణ పంచాయతీ వాహనాల్లో మాత్రమే వేయాలని వారు సూచించారు. సంపదపై ఎలాగైతే దృష్టి సారిస్తామో అలాగే స్వచ్ఛత పైన కూడా అందరూ దృష్టి సారించాలని వారు సూచించారు. మన ఆరోగ్యం బాగుండాలంటే మన చుట్టూ వుండే ప్రదేశాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. చెత్తవాహనాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలన్నారు. తరచూ వర్షపాతం వుండటంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఇతర జ్వరాలు సోకే ప్రభావం ఉంటుందన్నారు.

## భూసమస్యలపై 26న చలో బెంగళూరు

● ఐక్య వేదిక జిల్లా సంయుక్త పోరాట సమితి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సమితి సభ్యులు

బళ్లారి సిటీ,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భూమి, గృహ సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఐక్య వేదిక జిల్లా సంయుక్త పోరాట సమితి డిమాండ్ చేసింది. రైతులు, దళితులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువకులు, ఇతర వర్గాల ఐక్య వేదిక సంయుక్త కర్ణాటక పోరాటం ఈనెల 26న బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో భారీ నిరసనను నిర్వహిస్తుందని కమిటీ అధ్యక్షుడు కరియప్ప తెలిపారు. నగరంలోని ప్రతికాభవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 42లక్షల మంది ప్రభుత్వ భూమిలో వ్యవసాయం చేస్తున్న వారిలో 25లక్షల మందిని పరిశీలించి 15 మందిని ఎంపిక చేసి మూడు లక్షల మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారన్నారు. బగర్ హుకుం సాగు కమిటీ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం గిరిజనులను వీధుల్లోకి నెట్టి దేశంలోని అత్యంత దోపిడీదారులైన అంబానీ- ఆదానీలకు భూములు దారాదత్తం చేస్తోందన్నారు. ఈసందర్భంగా జి.విశ్వనాథ్, రామకృష్ణ, ఈశ్వరప్ప, మహేష్ కురవల్లి, వసంతరాజ్, బసవరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

# హోసూరు జోన్

## రైతులకు రాగి కోత యంత్రాలు : కలెక్టర్

హోసూరు నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హోసూరు డివిజన్‌లోని రైతులు నవంబరు చివరి వారం నుంచి రాగి కోత యంత్రాలను అద్దె ద్వారా పొందవచ్చని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు, ఈ విషయంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రస్తుతం కృష్ణగిరి జిల్లాలోని హోసూరు విభాగంలో రాగి కోత కాలం వచ్చిందని తెలిపారు. వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం, నవంబరు చివరి నుంచి తిరువన్నామలై, ఈరోడ్డు జిల్లాల నుంచి వ్యవసాయ ఇంజనీరింగ్ శాఖ యొక్క కోత యంత్రాలను అద్దె ద్వారా పొందగలగవచ్చు నని , రైతులు గంటకు రూ.1.160 చొప్పున అద్దె చెల్లించి యంత్రాన్ని ఉపయోగించవచ్చు. అలాగే హోసూరు సబ్ డివిజన్ పరిసర ప్రాంతాలలో యంత్రాల తక్షణ అద్దెకు ఈ క్రింది నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రైవేట్ యంత్ర యజమానులను కూడా సంప్రదించవచ్చు. రమేశ్ డెంకణీకోట 9585569275- ఈరోడ్డు టీఎంఆర్ ఆర్‌వెస్టార్ 7639438723, దేవరాజు ఈరోడ్డు 6382087913 , ఈరోడ్డు బాబు 9445207001, తిరువణ్ణామలై 7305701315 యంత్ర యాజమానులను సంప్రదించవచ్చని, వారి వారి నిర్ణయాన్ని బట్టి అద్దె కు ఇస్తారని, అలాగే సంప్రదించడానికి , అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రవి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కార్యాలయం , వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం, చెన్నత్తూరు పోస్ట్ ఆఫీసు కార్యాలయం, రాయకోట రోడ్డు, హోసూరు 9443093493 ను సంప్రదించవచ్చని దీని వల్ల ప్రయోజనం పొందవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## అద్దె బకాయిలపై అధికారుల ఆగ్రహం

● హౌసింగ్ బోర్డు ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ● బీజేపీ మండిపాటు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న కాలనీవాసులు

హోసూరు నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హోసూరు తమిళనాడు హౌసింగ్ బోర్డు ఇళ్లకు అద్దెలు చెల్లించనందుకు అధికారులు 20 ఇళ్లను సీజ్ చేయడంతో గురువారం స్థానికులు వాగ్వాదానికి దిగారు, కృష్ణగిరి జిల్లా హోసూరు కార్పొరేషన్‌లోని ఎళిల్‌నగర్ ప్రాంతంలోని తమిళనాడు హౌసింగ్ డెవలప్‌మెంట్ అపార్టుమెంట్ లో 500 కు పైగా ఇళ్లు ఉన్నాయి. ఇక్కడ చాలా మంది ప్రభుత్వానికి అద్దె చెల్లించకుండా నెలల తరబడి ఇళ్లలో అద్దెకు ఉంటున్నారు. అధికారులు పదే పదే నోటీసులు ఇచ్చిన్నప్పటికి వారు అద్దె చెల్లించలేదు. అధికారులు స్వయంగా వెళ్లి ఇళ్లలో ఉన్న వస్తువులను బయటపెట్టి ఇళ్లకు సీల్ వేశారు, దీనిని నిరసిస్తూ వాగ్వాదానికి దిగారు, ఈవిషయం తెలుసుకున్న బీజేపి జిల్లా మాజీ అధ్యక్షుడు నాగరాజు నేతృత్వంలో బీజేపి కార్యనిర్వాహకులు బాధితులకు మద్దతుగా వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు, దీని తర్వాత హోసూరు నగర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలతో చర్చలు జరిపారు, తర్వాత వాయిదాలతో చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని మరియు ఇప్పుడు వారు చెల్లించగలిగినంద మొత్తాన్ని చెల్లించి ఇళ్ల తాళాలను పొందాలని అధికారులు సూచించారు, దీని తరువాత సీల్ పగలగొట్టి ఇళ్లను తెరిచారు. తమిళనాడు హౌసింగ్ బోర్డు డెవలప్‌మెంట్ హౌసింగ్ స్కీమ్‌ల లబ్దిదారులు ప్రభుత్వానికి చెల్లిచాల్సిన అద్దె చెల్లించలేదని ప్రభుత్వ శాఖ అధికారులు తెలిపారు, ఫలితంగా ప్రతి అద్దెదారులు రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు చెల్లించలేదని, దీనికి దాదాపు రూ.20 లక్షలకు పైగా చెల్లించాలని, దీని కారణంగా మేము సీల్ వేశామని తెలిపారు, ప్రజలు ఆ తరువాత వాయిదాలతో చెల్లిస్తామని తెలిపారు,

## నగరంలో మేయర్ పర్యటన

హోసూరు నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హోసూరు పరిదిలోని రామనాయకన సరస్సు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును కౌన్సిల్ సభ్యులు, కార్పొరేషన్ అధికారులతో కలిసి మేయర్ సత్య గురువారం పరిశీలించారు. తనిఖీ సందర్భంగా ప్రజలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ అధికారులకు ఆదేశించారు. ఇందుల్లో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ స్థలాల ఏర్పాటు కూడా పరిశీలించారు. తర్వాత అదనపు క్రీడా సామగ్రిలను అందించడానికి ఏర్పాట్లు చేయలాని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, కౌన్సిలర్లు, ఇంద్రాణి , నాగరాజు, మారక్కచెన్నీరన్, యసశ్వినిమోహన్, జెయ్ ఆనంద్, ప్రజలు పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న మేయర్ సత్య

## ఉపాధిలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి

● కార్మికులను వేధించడం తగదు : ఏఐయూటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్




ర్యాలీగా వెళ్తున్న ఏఐయూటీయూసీ నాయకులు

బళ్లారి సిటీ,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గని కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించడంలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐయూటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ కోరారు. సండూరు తాలూకాలో అంబేద్కర్ భవన్ గురువారం ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గని కార్మికుల సదస్సులో ఆయన మాట్లాడారు. మైనింగ్ కార్మికులు తమ శ్రమతో సంబదను సృష్టిస్తున్నారని, దీని వల్ల ప్రభుత్వానికి, గని యజమానులకు కోట్లాది రుపాయల లాభం వస్తుందన్నారు. కానీ కార్మికుల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, మైనింగ్ కంపెనీలు కూడా కార్మికులను బానిసలుగా చేస్తున్నాయన్నారు. ఎన్ఎండీసీయూ కేంద్ర యజమాన్యంలోని సంస్థ అయినప్పటికీ కాంట్రాక్టు , ఔట్‌సోర్సింగ్ పేరుతో కార్మికులను దోపిడి చేస్తున్నాయన్నారు. కాంట్రాక్టు టెండర్ ముగిసిన తర్వాత కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి అస్థిరంగా మారుతోందన్నారు. ఎన్ఎండీసీ ఏ విధంగానూ సేవా భద్రతను నిర్ధారించదు. మరోవైపు భూమిని కోల్పోయిన , ఆరోగ్యం క్షీణించిన కుటుంబాలకు ఎన్ఎండీసీ శాశ్వత ఉపాధిని కల్పించాలన్నారు. ఈవిషయంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కానీ అధికారంలో ఉన్న ఏప్రభుత్వమైనా కార్మిక ప్రయోజనాలను పక్కనపెట్టి, పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతోదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని, అటువంటి పరిస్థితిలో గని కార్మికులు మరింతంగా సంఘటితమై పోరాటాలు చేయాలన్నారు. వేదికపై హులిగేశ్‌బాబు, సంతోష్, అంబరీశ్, మంజునాథ్, క్రాటేశ్ తదితరులున్నారు. ఈకార్యక్రమంలో ఏఐయూటీయూసీ జిల్లాకార్యదర్శి ప్రమోద్, ఉపాధ్యక్షుడు దేవదాస్ పాల్గొన్నారు. ఏఐయూటీయూసీ సిబ్బంది వర్గం, తదితరులు పాల్గొన్నారు. సండూరు ఏపీఎంసీ మార్కెట్ నుంచి నగరంలోని వేదిక అయిన అంబేద్కర్ భవన్ వరకు ఊరిగింపు ప్రదర్శన నిర్వహించారు.

## ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



ఇందిరా గాంధీకి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బళ్లారి సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధానమంత్రి , దివంగత శ్రీమతి ఇందిరాగాంధీ 108వ జయంతిని గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హామీ పథకం అమలు అథారిటీ జిల్లా ఉపాధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశానికి అనేకమైన సేవ చేశారన్నారు. ఆమె చేసిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయకరణం, మూలధనంపై నిషేధం, పోఖ్రాన్‌లో మొదటి అణు విద్యుత్ ప్లాంట్ వాడకం, 1971లో బంగ్లాదేశ్ విముక్తి, యుద్ధంలో పాకిస్తాన్‌ను ఓడించి 98వేల మంది పాకిస్తాన్ సైనికులను ఖైదీలుగా తీసుకోవడం నిత్యం గుర్తుండిపోయేవన్నారు. ఈసందర్భంగా దుర్గన్న, జగన్నాథ్, చంద్రు, జోగినచంద్రప్ప, ఎర్రిస్వామి, శివకుమార్, గీతాశాంతి, మమత,అరుణ్‌జ్యోతి, నజీమా, సలీంసాబ్, ఉమేశ్ గౌడ, రూపనగుడి రామాంజిని, శ్రీనివాస్‌భండారి, పాలక్షి, అరుణ్‌కుమార్ సింధ్వాల్, హనుమేశ్, రామారెడ్డి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో అమావాస్య పూజలు



అలంకరణలో సిద్దేశ్వర స్వామి



యర్రితాత



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



తాయమ్మదేవి

కంప్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేపట్టారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీ కాళికాదేవి అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. కార్తీక మాసం చివరి రోజున బుధవారం రాత్రి భక్తులు ఆలయాల్లో దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

### ఘనంగా ముత్యాలపల్లకి రథోత్సవం

బళ్లారి రూరల్ (ఆంధ్రజ్యోతి): చేళగుర్కి యర్రితాత ఆలయంలో కార్తీకమాసం అమావాస్య సందర్భంగా ముత్యాలపల్లకి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యర్రితాత దేవస్థానం నుంచి భక్తుల ఆధ్వర్యంలో రథాన్ని లాగారు. ఈ సందర్భంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు తరలివచ్చారు. అదేవిధంగా ఆలయ ప్రజలను కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలనగౌడ తెలిపారు.





అలంకరణలో కాళికాదేవి, దీపాలు వెలిగిస్తున్న మహిళలు

### తాయమ్మ దేవికి పూజలు

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన తాయమ్మదేవికి అమావాస్య పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీనివాస, ప్రవీణ్ దేవికి పుష్పాలంకార సేవ, ఆకులపూజ, అలంకార సేవలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

## అందరికీ ఇళ్లు ...

గోరంట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మండలంలో ఇళ్లు లేనివారికి ఇళ్లు నిర్మించే కార్యక్రమం చురుకుగా కొనసాగుతోంది. హౌసింగ్ సొంత స్థలం ఉండి, ప్రభుత్వం ద్వారా గృహం నిర్మించుకోవాలని ఆసక్తి ఉన్న వారిని అధికారులు, టీడీపీ నాయకులు గుర్తించి మార్కింగ్ ఇస్తున్నారు. పట్టణంలోని 4వార్డులో హౌసింగ్ అధికారులు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇంటి నిర్మాణంకోసం కొలతలు వేసి మార్కింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మల విద్యాధరణీ, గిరిజధర్‌గౌడ్, అజంతుల్లా, నాగరాజు, కక్కల రఘు పాల్గొన్నారు.

## 'విజయవంతంగా రోబోటిక్ సర్జరీ'

బళ్లారి సిటీ,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మణిపాల్ ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీ ద్వారా చికిత్స పొందుతున్న వ్యక్తి త్వరగా పూర్తి ఆరోగ్యవంతుడిగా కానున్నారని ఆర్థో సర్జన్ సమర్థ అన్నారు. గురువారంలోని పత్రికాభవన్‌లో ఆయన మాట్లాడుతూ జాయింట్ రిప్లేస్‌మెంట్, హిప్ ఆపరేషన్‌లో మణిపాల్ ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ చేశామన్నారు. ఇది మానవ సహితంగా చేయవలసి ఉంటుందన్నారు. దీని ద్వారా పూరిపూర్ణంగా చికిత్స సాధ్యమన్నారు. ప్రతి నెలా మూడవ గురువారం బళ్లారి ఆరాధన ఆసుపత్రిలో ఈ విధమైన సర్జరీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనికి ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాలు లేకపోయినా ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సర్జన్ సమర్థ

## కోళ్ల పరిశ్రమతో మహిళలకు ఉపాధి

జిల్లా పంచాయతీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే

బళ్లారి సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కోళ్లపరిశ్రమకు చాలా డిమాండ్ ఉందని, సరైన శిక్షణ ద్వారా మహిళలు వ్యవస్థాపకులుగా ఎదగాలని జిల్లా పంచాయతీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే అన్నారు. గురువారం నగరంలోని కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రాంగణంలో జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద ఏర్పడిన గ్రామపంచాయతీ స్థాయి సంఘాల మహిళలకు 13రోజుల ఉచిత కోళ్ల పెంపకం శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాపంచాయతీ, ఎన్ఆర్ఎల్ఎం ప్రాజెక్టు స్వయం సహాయక బృందాల సమాఖ్యల ద్వారా మహిళలు తమ గ్రామాల్లో కోళ్ల షెడ్లు నిర్మించుకుని మహిళా వ్యవస్థాపకులుగా మారడానికి సహాయం అందిస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజేసాబ్ ,ఎరిమణి,జెడ్పీ ప్రోగ్రామ్ మేనేజర్ రాజేంద్ర, లెక్చరర్లు జడప్ప, సిద్ధలింగమ్మ, సంతోష్‌కుమార్, పరమేశ్, ఎన్ఆర్ఎల్ఎం సిబ్బంది, బళ్లారి నుండి 70మంది క్యాంపర్లు పాల్గొన్నారు.